క్లుప్తంగా

30న జిల్లా స్థాయి బాడీబిల్డింగ్ పోటీలు



బాడీబిల్డర్‌కు ట్రాక్‌సూట్ అందిస్తున్న కరణంరెడ్డి

పెదగంట్యాడ: మండలంలోని న్యూ పెంటమాంబ జిమ్ ఆధ్వర్యంలో ఈ నెల 30న జిల్లా స్థాయి బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు హాజరు కానున్న బాడీ బిల్డర్లకు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు గురువారం ట్రాక్ సూట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బాడీ బిల్డర్లు ఈ పోటీల్లో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు. విజేతలకు మిస్టర్ విశాఖ టైటిల్‌తో పాటు ఇరవై వేల రూపాయలు నగదు బహుమతి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రామిరెడ్డి, కిలాన ముసలయ్య, నాగిరెడ్డి, ప్రసాద్, రామోజీ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్ ఇండియా క్విజ్ పోటీల్లో 'లిటిల్ ఏంజిల్స్' ప్రతిభ

ఉక్కునగరం: విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన ఫిట్ ఇండియా క్విజ్ పోటీల్లో స్థానిక లిటిల్ ఏంజిల్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పి. సాయితేజ, పి. భరత్‌కుమార్ నాలుగు రౌండ్లు విజయవంతంగా పూర్తి చేసుకుని రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ముంబైలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ విజేతలకు రూ. 25 వేలు, అవార్డులు, పాఠశాలకు రూ. 2,50,000 నగదు బహుమతిని ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా విజేతలను పాఠశాల యాజమాన్యం, సిబ్బంది అభినందించారు.

తులసీ దళాలంకరణలో తిరుమల బాలాజీ


ప్రత్యేక అలంకరణలో తిరుమల బాలాజీ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కొలువైయున్న బాలాజీ గురువారం తులసి దళపద్మాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.శుక్రవారం ఉదయం 5 గంటలకు బాలాజీకి పంచామృతాభిషేకం నిర్వహించనున్నట్లు శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసిపూజ


సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

ఆంధ్ర టెక్ లీగ్ పోస్టర్ విడుదల

ఏయూ క్యాంపస్: సాంకేతిక రంగంలో యువతను ప్రోత్సహించేలా ఆంధ్ర టెక్ లీగ్ నిర్వహిస్తున్నట్టు టెక్ టీం సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి..ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫైనల్ పోటీలు ఏయూ ఎ హబ్ వేదికగా అక్టోబర్ 1న నిర్వహించనున్నారు. డిజైన్ థింకింగ్, త్రీ డీ ప్రింటింగ్, కోడింగ్, రోబోటిక్స్, డ్రోన్స్, హ్యూమనాయిడ్ రోబోట్ అంశాల్లో ఈ పోటీలు జరుగుతాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. పాఠశాల విద్యార్థులు, ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చునన్నారు.

ఆకర్షణీయంగా అంగన్‌వాడీ కేంద్రాలు

- సెంటర్లలో అత్యాధునిక వసతులు
- కేంద్రాలకు పెరుగుతున్న విద్యార్థులు


ఆటల్లో నిమగ్నమైన చిన్నారులు


టీచర్ బోధిస్తున్న పాఠాలను శ్రద్ధగా వింటున్న బుజ్జాయిలు

పెదగంట్యాడ: ఒకప్పుడు అంగన్‌వాడీ కేంద్రాలంటే శిథిల భవనాల్లో, ఇరుకు గదుల్లో నామమాత్రపు వసతులతో ఉండేవి. సరైన సౌకర్యాలు లేకపోవడంతో తమ చిన్నారులను పంపించేందుకు కూడా తల్లిదండ్రులు వెనుకాడేవారు. గర్భిణులు, బాలింతలు కూడా కేంద్రాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపేవారు కాదు. కానీ నేడు పరిస్థితి మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ.. పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను కూడా ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. విశాలమైన గదులు, గోడలపై చిన్నారులను ఆకట్టుకునే విధంగా రంగురంగుల బొమ్మలతో తీర్చిదిద్దారు. అన్ని వసతులతో పక్కా భవనాలు నిర్మించడంతో పాటు గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. దీంతో చిన్నారులు క్రమం తప్పకుండా ఈ కేంద్రాలకు హాజరవుతున్నారు.

ప్లే స్కూల్‌లా..

అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన భవనాలను రంగురంగుల బొమ్మలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. బుజ్జాయిలను ఆకట్టుకునే విధంగా ఆకర్షణీయమైన చిత్రాలను రూపుదిద్దారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలు ప్లే స్కూల్ మాదిరిగా కనిపిస్తున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ ప్లే స్కూల్స్, ప్రీ ప్రైమరీ విద్యార్థులకు కల్పించే సౌకర్యాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం సమకూర్చడంతో చిన్నారులు ఆరోగ్యకర వాతావరణంలో ఆటపాటలతో విద్యను అభ్యసిస్తున్నారు.

51 కేంద్రాలు.. 5293మంది చిన్నారులు

పెదగంట్యాడ సెక్టార్ పరిధిలో 25 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఇస్లాంపేట సెక్టార్ పరిధిలో 26 కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మండలంలో మొత్తం 51 కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఈ రెండు సెక్టార్లలో మొత్తం 5,293 మంది చిన్నారులు ఉండగా, బాలింతలు 531మంది, గర్భిణులు 630 మంది ఉన్నారు. వీరందరికీ ప్రతి రోజూ పౌష్టికాహారం అందిస్తున్నారు.

మెనూ ఇలా...	రోజు	ఉదయం	మధ్యాహ్నం
	సోమవారం	ఉడికించిన కోడి గుడ్డు,పాలు	అన్నం, దోసకాయ పప్పు, కోడిగుడ్డు కూర
	మంగళవారం	ఉడికించిన కోడి గుడ్డు, పాలు	అన్నం, టమాటా పప్పు, కోడిగుడ్డు కూర
	బుధవారం	ఉడికించిన కోడి గుడ్డు, పాలు	అన్నం, ఆకుకూర పప్పు, కోడిగుడ్డు కూర
	గురువారం	ఉడికించిన కోడి గుడ్డు, పాలు	ఎగ్ ఫ్రైడ్‌రైస్, ఆకుకూర సాంబారు
	శుక్రవారం	పాలు	అన్నం,బీరకాయ/సొరకాయ, గుడ్డు కూర
	శనివారం	ఉడికించిన కోడి గుడ్డు,పాలు	వెజిటబుల్ రైస్, ఆకుకూర సాంబారు


భోజనాలు చేస్తున్న చిన్నారులు

మా పాప చక్కగా చదువుకుంటోంది


మా అమ్మాయిని రోజూ అంగన్‌వాడీ కేంద్రానికి పంపిస్తున్నాను. ఇక్కడ పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులున్నాయి. మంచి ఆహారం అందిస్తున్నారు. ఇంటి వద్ద కంటే ఇక్కడే బాగా ఆడుకుంటూ, చదువుకుంటోంది.
– అల్లాడి దివ్య, తల్లి, జేఎన్ఎన్ఆర్‌యూఎం కాలనీ

ఇక్కడికి వస్తానని మారాం చేస్తాడు


మాకు ఒక పాప, బాబు. ముందు మా అమ్మాయిని ఈ కేంద్రానికి పంపించేదాన్ని. ఇప్పుడు మా పాప స్కూల్‌కు వెళ్తోంది. ఇప్పుడు నా అబ్బాయిని రోజూ కేంద్రానికి పంపిస్తున్నాను. ఎవరైనా పిల్లలు బడికి వెళ్లాలంటే మారాం చేస్తారు. కానీ ఉదయాన్నే బడికి పంపించమని గొడవ చేస్తుంటాడు. వెంటనే తయారు చేసి పంపిస్తుంటాను. అంగన్‌వాడీ కేంద్రం బాగుంది. సదుపాయాలు ఉన్నాయి.
– లంకాడ ప్రమీల, తల్లి, ప్రియదర్శిని కాలనీ

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ


అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించడంతో మంచి వాతావరణం నెలకొంది. మా కేంద్రాలకు వచ్చే చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాం. వారికి ఆటపాటలతో చదువు చెబుతున్నాం. నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నాం. బాలింతలు, గర్భిణులకు బలవర్ధకమైన ఆహారం పెడుతున్నాం. నిర్వహణ బాగుందని అందరూ ప్రశంసిస్తున్నారు.
– కె.కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్, ప్రియదర్శిని కాలనీ

ఉద్దేశపూర్వకంగానే 'ఉక్కు' ఉత్పత్తికి ఆటంకం

- విషం చిమ్ముతున్న గంగవరం పోర్టు ఎత్తుగడలను అడ్డుకుంటాం
- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 896వ రోజుకు రిలే నిరాహార దీక్షలు


దీక్ష శిబిరంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి గంగవరం పోర్టు యాజమాన్యం కావాలనే ఆటంకం కలిగిస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆరోపించారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు కావాల్సిన కుకింగ్ కోల్ తరలింపునకు అడ్డు తగులుతూ విశాఖ ఉక్కుపై విషం చిమ్ముతున్న గంగవరం పోర్టు ఎత్తుగడలను కార్మికులందరం అడ్డుకుంటామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 896వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన ఎంఎంఎస్ఎం, ఎస్‌బీఎం విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి, ప్రైవేటీకరణకు సహకరిస్తున్న గంగవరం పోర్టు యాజమాన్యానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోర్టు, స్టీల్‌ప్లాంట్ మధ్య హ్యాండ్లింగ్ చార్జీల లావాదేవీలు నిరంతరం జరుగుతుంటాయని, కానీ, ఇటీవల ఉద్దేశపూర్వకంగానే అదాని గంగవరం పోర్టు యాజమాన్యం స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి అవరోధాలు కల్పిస్తోందని ఆరోపించారు. పోర్టు యాజమాన్యం త్వరితగతిన సమస్యను పరిష్కరించకపోతే గంగవరం పోర్టుకు అనుసంధానమైన రోడ్డు, రైళ్లు, వేగన్లు, నీరు, విద్యుత్ వంటివాటిని స్తంభింపజేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వానికి తోడుగా గంగవరం పోర్టు యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన ఆసన్నమైందన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

హిందుజా గ్రామ కమిటీని రద్దు చేయాలి

- పాలవలస గ్రామస్తుల డిమాండ్
- ఆర్డీవో సమక్షంలో గ్రామసభ


ఎంపీపీ పాఠశాల గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

పెదగంట్యాడ: హిందుజా గ్రామ కమిటీ ప్రతినిధులు పాలవలస గ్రామాభివృద్ధికి కాకుండా వారి సొంత లాభాల కోసమే పని చేస్తున్నారని పాలవలస గ్రామస్తులు ఆరోపించారు. కాంట్రాక్టుల కోసమే పని చేస్తున్న ఆ కమిటీని వెంటనే రద్దు చేయాలని వారు ఆర్డీవో హుస్సేన్ సాహెబ్‌ను కోరారు. పాలవలస గ్రామంలో ఆర్డీవో సమక్షంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. యాష్ పాండ్ కారణంగా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గ్రామంలో రోడ్లు, కాలువలు నిర్మించాలని కోరారు. హిందుజా కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ఉపాధి కల్పించలేదని ఆరోపించారు. స్పందించిన ఆర్డీవో నిర్వాసితులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలోకి వస్తున్న దుమ్ము, ధూళిని అరికట్టేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో కాకి బాబు, పాల అచ్చిలనాయుడు, మద్ది పైడిరెడ్డి, సావాడ అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ పాఠశాల పరిశీలన

జీవీఎంసీ 65వ వార్డు బాపూజీ కాలనీలోని ఎంపీపీ పాఠశాలను ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ గురువారం పరిశీలించారు. ఈ పాఠశాలకు ఆటస్థలం కేటాయించాలన్న స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే నాగిరెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్‌కు లేఖ రాయడంతో, ఆయన ఆదేశాలతో ఆర్డీవో గురువారం పాఠశాలను పరిశీలించారు. అక్కడ ఆట స్థలం కోసం స్థలాన్ని కేటాయించేలా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, మద్దాల అప్పారావు, లోకనాథం, రూప, రాంబాబు, అన్నాజీ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యానికి గంగవరం పోర్టు కుట్ర

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం, గంగవరం పోర్టులు కుట్ర చేస్తున్నాయని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు ఆరోపించారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంగవరం పోర్టుతో స్టీల్‌ప్లాంట్ ఏడాదికి రూ.500 కోట్లు నుంచి రూ. 600 కోట్లు వ్యాపార లావాదేవీలు చేస్తోందన్నారు. ఇది మర్చిపోయి కేవలం రూ. 50 కోట్లు బకాయి కట్టలేదన్న సాకుతో పోర్టుకు వచ్చిన కోల్ షిప్‌లకు బెర్త్‌లు కేటాయించకుండా ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ప్లాంట్‌కు సంబంధించిన 1400 ఎకరాలను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం గంగవరం పోర్టుకు కేటాయించి, దానికి బదులుగా రాష్ట్ర ప్రభుత్వం వాటా తీసుకుందన్నారు. కేవలం రూ. 50 కోట్ల కోసం రూ. వెయ్యి కోట్ల విలువైన సరకును ఆపడం వంటి చర్యలను పోర్టు యాజమాన్యం ఆపకపోతే పోర్టు వాహనాల రాకపోకలను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కారు రమణ, ప్రభాకరరెడ్డి, కొమ్ము ప్రసాద్, బీఎంకె నాయక్, ఎస్.ఎ. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కూర్మన్నపాలెం: వడ్లపూడి విద్యుత్ సబ్ స్టేషన్లలోని 33/11 కేవీ ఫీడర్ల పరిధిలో చెట్లు కొమ్మలు తొలగించుట, నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా శివాజీనగర్, కూర్మన్నపాలెం, ప్రశాంతినగర్, రాజీవ్‌నగర్, రాసాలమ్మ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేవీ చిల్డ్రన్ స్కూల్‌లో మిల్లెట్స్ వారోత్సవాలు


మిల్లెట్స్ ప్రాధాన్యాన్ని వివరిస్తున్న విద్యార్థులు

సింధియా: నేవీ చిల్డ్రన్స్ స్కూల్‌లో మిల్లెట్స్ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ నెల 19 ప్రారంభమైన ఉత్సవాలు 26వ తేదీ వరకు జరిగాయి. వారోత్సవాల్లో భాగంగా చిరుధాన్యాలను ప్రదర్శించడంతో పాటు ఆరోగ్యకర జీవనశైలిలో వాటి ప్రాధాన్యాన్ని విద్యార్థులు వివరించారు. స్లోగన్ రైటింగ్, పోస్టర్ మేకింగ్, క్విజ్, ఇంటర్‌స్కూల్ పేపర్ ప్రెజెంటేషన్, ప్యానెల్ డిస్కషన్ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమానికి బ్రిగేడియర్ ఎస్.రామనాథన్, వీఎస్ఎం, డీడీజీ అండ్ సీఈ, డీజీఎన్‌పీ ముఖ్య అతిథులుగా హాజరై వివిధ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, ట్రోఫీలను అందజేశారు.

స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్ సీజీఎంకు సత్కారం


మార్కెటింగ్ సీజీఎం సత్యానందంను సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్ విభాగం చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) ఎం.సత్యానందంను గురువారం ఘనంగా సత్కరించారు. సత్యానందం ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా యుటిలిటీస్ విభాగం కాన్ఫరెన్స్ హాల్లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగులు, యూనియన్ నాయకులు ఆయనకు సన్మానం చేశారు. స్టీల్‌ప్లాంట్ కోసం అంకితభావంతో పనిచేసి కనిష్ఠ స్థాయి నుంచి అంచెలంచెలుగా చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగారని వక్తలు కొనియాడారు. సన్మానగ్రహీత సత్యానందం మాట్లాడుతూ అధికారులు, సహోద్యోగులు అందించిన సహకారం మరువరానిదన్నారు. కార్యక్రమంలో యుటిలిటీస్ విభాగాధిపతి ఎస్.ఆర్.రవి, జీఎం శ్యాంబాబు, ఐఎన్‌టీయూసీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, సీహెచ్. సుదర్శనం, బి. రామారావు, వరహాల బాబు, కాశీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్ఈపీ-2020'తో సత్ఫలితాలు

- 21వ శతాబ్ద అవసరాలకు అనుగుణంగా బోధన
- ఆటపాటలతో విద్యార్థుల అభ్యసనం
- ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఆదిశేష శర్మ


ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయంలో బోధనకు వాడుతున్న చిత్రాలు, బొమ్మలను పరిశీలిస్తున్న దృశ్యం


విలేకర్లతో మాట్లాడుతున్న ఎన్ఏడీ కేవీ ప్రిన్సిపాల్ ఆదిశేష శర్మ, ఇతర కేవీల ప్రిన్సిపాల్స్

గోపాలపట్నం: జాతీయ విద్యావిధానం - 2020లో భాగంగా విద్యార్థులు ఆటపాటల ద్వారా అభ్యసిస్తున్నారని ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఆదిశేషశర్మ అన్నారు. 21వ శతాబ్ద అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేలా ఈ విధానం ఉందన్నారు. ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయంలో నూతన విద్యావిధానం అమలై మూడేళ్లు అయిన సందర్భంగా వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల లోపు పిల్లలు మూడు విధాలుగా విద్యను అభ్యసిస్తున్నారన్నారు. వారు విద్యపై ఆసక్తి పెంచుకునేలా, సులువుగా అర్థం చేసుకునేలా ఆటపాటలతో ఉపాధ్యాయులు బోధిస్తున్నారన్నారు. పాఠశాలకు విద్యార్థులు సంతోషంగా వస్తున్నారని చెప్పారు. వారిలో శాస్త్రీయ స్వభావాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

49 కేవీల్లో బాల్వాడీ విధానం

49 కేంద్రీయ విద్యాలయాల్లో బాల్వాడీ విధానం అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. 3ప్లస్, 4ప్లస్, 5ప్లస్ ఏళ్ల వయసు గల విద్యార్థులను మూడు విభాగాలుగా విభజించి, బోధిస్తున్నామన్నారు. 2022-23 విద్యాసంవత్సరంలో 5,477 మంది విద్యార్థులు మూడు తరగతుల్లో ప్రవేశం పొందారని తెలిపారు. విద్యాలయాల్లో పేరెంట్ టీచర్ అసోసియేషన్ ఉందని, ప్రతీ నెలా పేరెంట్ టీచర్ సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మెరుగైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

వన్ నేషన్.. వన్ డిజిటల్ ప్లాట్‌ఫాం

నేషనల్ కరికులం ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫౌండేషన్ స్టేజ్ (ఎన్‌సీఎఫ్ ఎఫ్ఎస్) 2022లో పాఠ్యాంశాల్లో 8వ తరగతి నుంచి అన్ని కేంద్రీయ విద్యాలయాల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్‌ను వృత్తిపరమైన సబ్జెక్ట్‌గా ప్రవేశపెట్టారన్నారు. 228 కేవీల్లో స్కిల్ హబ్‌లు ప్రారంభమయ్యాయని తెలిపారు. పీఎం ఈ-విద్య ద్వారా విద్యార్థులకు డిజిటల్, ఆన్‌లైన్, ఆన్ ఎయిర్ ద్వారా విద్యను అందిస్తున్నారన్నారు. వన్ నేషన్.. వన్ డిజిటల్ ప్లాంట్‌ఫాంగా ఉందన్నారు. విద్యార్థులకు మెరుగైన అభ్యసనం కోసం కేవీల్లో డెస్కటాప్‌లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్‌లతో స్మార్ట్ క్లాస్‌రూములు ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థులకు ఏ విధంగా విద్యబోధన చేస్తున్నారో వివరించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యాభ్యాసం కోసం తయారు చేసిన వివిధ రకాల బొమ్మలు, వస్తువులను ప్రదర్శనలో ఉంచారు. వాటిని పలు కేంద్రీయ విద్యాలయాల ప్రిన్సిపాల్స్ సందర్శించారు. కార్యక్రమంలో కేవీ-2 ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కేవీ-1 ప్రిన్సిపాల్ సురేష్ కుమర్, స్టీల్‌ప్లాంట్ కేవీ ప్రిన్సిపాల్ శ్యామ్ కుమార్, మల్కాపురం కేవీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య, హెచ్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.


బోధనకు వాడుతున్న బొమ్మలు

అప్పన్నకు విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు

- ఘనంగా స్వర్ణతులసీ దళార్చన
- విశేషంగా నిత్య కల్యాణం
- వైభవంగా గరుడసేవ


గరుడ సేవలో పాల్గొన్న భక్తులు


స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, అధికారులు, భక్తులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. ఉభయదాతలను వెంటబెట్టుకుని స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజలో 108 స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందించారు. ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు చక్రవర్తి తదితరులు ఈ పూజలను నిర్వహించారు.

విశేషంగా నిత్య కల్యాణం

సింహాద్రినాథునికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి, విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా గరుడసేవ

సింహాచలేశునికి గురువారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందించారు. భక్తులతో గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.


కల్యాణంలో తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

విద్యార్థులకు ప్రత్యేక వర్క్‌షాప్


విద్యార్థులతో ఏయూ ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఉన్నత్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. సోషల్ వర్క్ భాగంలో నిర్వహించిన కార్యక్రమంలో 'గ్రామీణ ప్రాంతాలలో ఏ విధమైన కార్యక్రమాలు నిర్వహించాలి' అనే అంశంపై అవగాహన కల్పించారు. యూబీఏ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.పావని మాట్లాడుతూ గ్రామాల్లో యూబీఏ నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలియజేశారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య ఎస్.హరనాథ్, పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.సోనిహవీల, తదితరులు పాల్గొన్నారు.